## ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి

### నారాయణఖేడ్‌లో పొట్టి శ్రీరాములు వర్ధంతిని జరుపుకున్న ఆర్యవైశ్యులు

**నారాయణఖేడ్ టౌన్, డిసెంబరు 15, ప్రభాతవార్త:**
అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని పట్టణ ఆర్యవైశ్యసంఘం అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మునియాల మాణిక్‌ప్రభు మాట్లాడుతూ భాషాప్రాతిపదికన రాష్ట్రాలవిభజన కోసం తనప్రాణాలను అర్పించాడని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య ఉపాధ్యక్షులు కోటగిరి సత్యం, మండలాధ్యక్షులు ఆత్మకూరు రాజు, సంఘంనాయకులు దారంలక్ష్మణ్, ప్రభాకర్, గోలిరాములు, కాటేపల్లిభూషణం, దారంవిజయ్, సాంబయ్యగారి అశోక్, గుండప్పగారి దత్తు, సంగమేశ్వర్, సాంబయ్యగారి శ్రీకాంత్, దారంరమేష్,కొత్త శంకర్ సాయి, సంగమేశ్వర్, కోటగిరి వీరయ్య, మేడం సంతోష్ పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## ఘనంగా దత్తాత్రేయ జయంతి

### -పాల్గొని పూజలు చేసిన పిసిసి సభ్యులు శ్రీనివాస్

**నాగల్‌గిద్ద, డిసెంబరు 15, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన నాగల్‌గిద్దలోని శివాలయంలో ఆదివారం శ్రీదత్తాత్రేయ జయంతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో అంబదాస్ మహారాజ్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఆలయానికి పిసిసి సభ్యులు కర్నె శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాలు, కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో గత ఏడు రోజులుగా కొనసాగుతన్న సప్తహ భజన కార్యక్రమాలు ఆదివారంతో ముగిసాయి. జయంతి ఉత్సవాల్లో డిసిసి కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, సొసైటీ చైర్మన్ శ్రీకాంత్, నాయకకులు సంజీవ్ పాటిల్, శరణప్ప శేరికర్, కొండల్ రెడ్డి, శివకుమార్, సురేష్‌సేట్ బక్షిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

**కొల్చారం, డిసెంబరు 15, ప్రభాతవార్త:** గతంలో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో మెదక్-హైదరాబాద్ ప్రధానరహదారిపై చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని, 108 అంబులెన్స్ అందుబాటులోలేక ప్రాణాలు కోల్పోతున్నారని, 108 అంబులెన్సును ఇవ్వాలని రాష్ట్ర వైద్యశాఖ మంత్రిని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కోరడం జరిగింది. దీనికి స్పందించిన మంత్రి కొల్చారం, వెల్దుర్తి మండలాలకు 108 అంబులెన్సులను మంజూరు చేయడం జరిగింది. ఇందుకు గాను మంత్రికి ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

## వార్షికోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక



ఎమ్మెల్యే రోహిత్‌రావుకు ఆహ్వానం అందిస్తున్న స్వాములు

**రామాయంపేట, డిసెంబరు 15, ప్రభాతవార్త:** రామాయంపేట పట్టణంలో అభయాంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవానికి విచ్చేయాలని కోరుతూ పట్టణానికి చెందిన అభయాంజనేయస్వామి గురుస్వామి లాలాగౌడ్ ఆధ్వర్యంలో స్వాములు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమాలు ఈనెల 16 నుండి 18 వరకు కొనసాగుతాయని వారు తెలిపారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమాలకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలి



డైట్ మెనూ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ వెంకటరాజాగౌడ్

**రామాయంపేట, డిసెంబరు 15, ప్రభాతవార్త:** రామాయంపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం తెలంగాణ రాష్ట్రప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన డైట్‌మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రామాయంపేట సిఐ వెంకటరాజాగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మెనూ కార్డును ప్రారంభించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని, శ్రద్ధగా చదివి, రాబోవు రోజుల్లో మంచి అధికారులుగా తయారై ప్రజలకు సేవలు అందించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం కోసమే ప్రభుత్వం 40శాతం మేర మెస్‌చార్జీలు పెంచిందని, ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంధ్యారాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్, పేరెంట్స్ కమిటీ చైర్మెన్ గావు సురేందర్, వైస్ చైర్మెన్ లతాగౌడ్, వైస్ ప్రిన్సిపాల్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

## కెవికెను సందర్శించబోతున్న ఉపరాష్ట్రపతి



జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ ఉపరాష్ట్రపతికి బందోబస్తీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

**కౌడిపల్లి, డిసెంబరు 15, ప్రభాతవార్త:** ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ ఈ నెల 25వ తేదీన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని తునికి గేట్ సమీపంలో గల డా.రామానాయుడు గ్రామీణ వ్యవసాయ విజ్ఞాన విద్యా సంస్థలో నిర్వహిస్తున్న గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఏకలవ్య కృషి విజ్ఞానకేంద్రాన్ని (కెవికె) పర్యటించబోతున్నందున విజ్ఞానకేంద్రం నిర్వాహకులు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి, బందోబస్తీని ఏర్పాటు చేయడానికి జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదివారం విచ్చేశారు. ముందుగా నిర్వాహకులు చేస్తున్న ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కెవికె ఏరియల్ సర్వే చేసి, ఉపరాష్ట్రపతికి ఏవిధంగా బందోబస్తీ ఇవ్వాల్లో స్థానిక ఎస్సై రంజీత్‌కుమార్‌రెడ్డితో ఎస్పీ క్షుణ్ణంగా స్థలాన్ని పరిశీలించినారు. రైతులతో ఉపరాష్ట్రపతి ముఖాముఖి కార్యక్రమంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవడానికి గాను అనుకూలంగా షామియాలను ఏర్పాట్లు చేయాలని ఎస్పీ కెవికె నిర్వాహకులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు జిల్లా ఉత్తమ రైతు బాన్సువాడ మహీపాల్‌రెడ్డి, సీనియర్ శాస్త్రజ్ఞుడు డా.నల్కర్, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌ను ప్రారంభించిన టిపిసిసి కార్యదర్శి

**వెల్దుర్తి, డిసెంబరు 15, ప్రభాతవార్త:** మాసాయిపేట మండలానికి నూతనంగా మంజూరైన 108 అంబులెన్స్‌ను ఆదివారం టిపిసిసి కార్యదర్శి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దమోదర రాజనరసింహాలకు మాసాయిపేట మండల ప్రజల తరపున ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కృష్ణారెడ్డి, సిద్ధిరాములు గౌడ్, మాజీ సర్పంచి మధుసూదన్ రెడ్డి, నాయకులు శ్రీకాంత్ రెడ్డి,, సిద్ధిరాములు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మొదటిరోజు గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతం

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
రాష్ట్రప్రభుత్వం రెండురోజుల పాటు నిర్వహించ తలపెట్టిన టిజిపిఎస్‌సి గ్రూప్-2 పరీక్షలు మొదటిరోజు ఆదివారం జిలాల్లో ప్రశాంతంగా ముగిశాయి. అభ్యర్థులు ప్రశాంత వాతవరణంలో పరీక్షలు రాయడానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేశారు. నిమిషం నిబంధనతో అభ్యర్థులు గంట ముందుగానే పరీక్షాకేంద్రాలకు చేరుకున్నారు. అభ్యర్థులను తనిఖీ చేసిన తర్వాతనే పరీక్షాకేంద్రాలలోకి అనుమతించారు.

పరీక్షల నిర్వహణకు జిల్లా కేంద్రంలో 37 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేయగా మొదటిరోజు ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు నిర్వహించిన పేపర్-1 పరీక్షకు 13717 మంది హాజరు కావాల్సి ఉండగా 7005 మంది హాజరయ్యారు. 6712 మంది హాజరు కాలేదు.

మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహించిన పేపర్-2కు 13717మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 6955 మంది హాజరు కాగా 6762 మంది హాజరుకాలేదు. కాగా ఒక్క నిమిషం అలస్యం నిబంధనతో పలువురు విద్యార్థులు వెనుదిరిగినట్లు సమాచారం.

**పరీక్షాకేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్, సిపి...**
గ్రూప్-2 పరీక్షాకేంద్రాలను జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, సిపి డాక్టర్ అనురాధలు సందర్శించారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి మెరిడియన్ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలుర ప్రభుత్వ నూతనోన్నత పాఠశాల, బిఎంఆర్ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాలను సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.

కాగా సిపి డాక్టర్ అనురాధ ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాల తదితర పరీక్షాకేంద్రాలను ఆమె పరిశీలించి బందోబస్తు తీరును పరిశీలించారు. పరీక్షాకేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

మొదటి పేపర్‌కు 7005 మంది హాజరు, గైర్హాజరైన 6712 మంది అభ్యర్థులు
రెండో పేపర్‌కు 6955 మంది హాజరు, గైర్హాజరైన 6762 మంది అభ్యర్థులు



పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

## పాట ఉన్నన్ని రోజులు గద్దరన్న సజీవం

### మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు




సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్ధిపేట రూరల్, డిసెంబరు 15, ప్రభాతవార్త:**
గద్దరన్న భౌతికంగా మనమధ్య లేక పోయినా, పాట ఉన్నన్ని రోజులు గద్దరన్న సజీవంగానే ఉంటారని మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రజా యుద్ధనౌక గద్దరన్న సాహిత్యం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 5 దశాబ్దాలలో జరిగిన ప్రతి పోరాటంలో గద్దరన్న పాల్గొన్నాడని తెలిపారు. విప్లవ, తెలంగాణ, దళిత, ఉద్యమాలతో పాటు ఉద్యమంలో న్యాయం వైపు నిలిచి అన్యాయాన్ని గద్దరన్న ప్రశ్నించారని పేర్కొన్నారు. 100 ఉపన్యాసాల సారం గద్దరన్న ఒక్క పాట సామాన్యపదాలతో ప్రజల హృదయాల్లోకి చేరుకొనే విధంగా పాటలు ఉంటాయన్నారు. పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా పాట తెలంగాణ ఉద్యమాన్ని, సమాజాన్ని ఉద్రుతలూగించి ప్రజల్లో చైతన్యం నింపిందన్నారు. తెలంగాణ ఉద్యమానికి కెసిఆర్ అండగా గద్దరన్న నిలిచారని చెప్పారు. సిద్ధిపేటలో గద్దరన్న విగ్రహం పెట్టడం మాకు చాలా గౌరవం. పెట్టించే బాధ్యత నాది అన్నారు. త్వరలోనే గద్దర్ విగ్రహాన్ని సిద్ధిపేటలో ఏర్పాటు చేసుకొని భారీ బహిరంగ సభను నిర్వహించుకుందామన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ప్రముఖ కవి, రచయిత డాక్టర్ నందిని సిధారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి సూర్యకిరణ్ తదితరులు మాట్లాడారు. అంతకుముందు గద్దరన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కార్యక్రమంలో ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు గొట్టిపర్తి పాపయ్యగౌడ్, కలకుంట్ల రంగచారి, ఆస లక్ష్మణ్, పొచబోయిన శ్రీహరి, పి.శంకర్, తిరుపతిరెడ్డి, కవులు, కళాకారులు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు

**సంగారెడ్డిబ్యూరో డిసెంబరు 15:** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్2 పరీక్షలు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ ఆదివారం ప్రారంభం అయ్యాయి. జిల్లాకేంద్రంలోని సెంట్ ఆంతోని, పయనీర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాన్ని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎమ్మెన్నార్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌లు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది గమనించి పలు సూచనలు చేశారు. కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఆదివారం ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు జిల్లాలో 41 పరీక్షాకేంద్రంలో 15218 మంది అభ్యర్థులకు గాను పేపర్ 1 పరీక్షకు7359 మంది హాజరు కాగా, 7859 మంది గైర్హాజరు అయ్యారు. పేపర్ 2 పరీక్షకు 7206 మంది పరీక్షకు హాజరు కాగా, 8012 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. ఆదివారం జరిగిన మొదటి సెషన్ పరీక్షకు 48 శాతం మంది విద్యార్థులు హాజరు అయ్యారని, 42 శాతం మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరు అయినట్లు అధికారులు తెలిపారు. పేపర్ 2(రెండవ సెషన్ పరీక్షకు) 47.4 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు అయ్యారని తెలిపారు. ఆది, సోమవారాలలో ఉదయం, మధ్యాహ్నం చొప్పున మొత్తం నాలుగు సెషన్లలో జరిగే గ్రూప్2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి వెల్లడించారు.

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ గ్రూప్2 పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు

## పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 15, ప్రభాతవార్త:**
రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా, లేదా అన్నది గమనించి పలు సూచనలు చేశారు. కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఆదివారం ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు జిల్లాలో మొత్తం 5,855 మంది అభ్యర్థులకు గాను 2,868 మంది హాజరు కాగా, 2,987 మంది గైర్హాజరయ్యారని, 5,855 మంది అభ్యర్థులకు గాను మధ్యాహ్నం సెషన్‌లో 2859 మంది పరీక్షకు హాజరు కాగా, 2,996మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఆది, సోమవారాలలో ఉదయం, మధ్యాహ్నం చొప్పున మొత్తం నాలుగు సెషన్లలో జరిగే గ్రూప్-2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ రాహుల్ రాజ్ వెల్లడించారు.

## సిఎం ఇంటిని ముట్టడిస్తాం



విలేకరులతో జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతున్న దృశ్యం

**సిద్ధిపేట రూరల్, డిసెంబరు 15, ప్రభాతవార్త:**
సిఎం రేవంత్‌రెడ్డి ముదిరాజులను బిసి డి నుంచి బిసి ఎ లోకి మారుస్తానని ఇచ్చిన హామీని ఈ అసెంబ్లీ సమావేశాలలో బిల్లు ప్రవేశపెట్టకుంటే ప్రజాభవన్, అసెంబ్లీతో పాటు సిఎం ఇంటిని ముట్టడిస్తామని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ హెచ్చరించారు. ముదిరాజ్ ఎసి కన్వెన్షన్ హాల్‌లో ముదిరాజ్ హక్కుల సాధన సమితి సభ్యులు ఆదివారం నిర్వహించిన సన్నాహ సమావేశంలో ముదిరాజులకు జరుగుతున్న అన్యాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరాలు మారినా ప్రభుత్వాలు మారినా ముదిరాజుల తలరాతలు మారడంలేదన్నారు. ఎన్నికల సమయంలో ముదిరాజులను కేవలం ఓటు బ్యాంకు కోసం వినియోగించుకుంటున్నారన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. ముదిరాజులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని లేదంటే పోరాటాలు తప్పవన్నారు. సమావేశంలో ముదిరాజ్ హక్కుల సమితి ప్రతినిధులు పడిగె ప్రశాంత్, రాగుల రాజు, గౌరవేని సుమన్, పడిగే లింగం, గౌరవేని కిషన్ పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్పస్వామి మహాపడిపూజ.

### హాజరైన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



అయ్యప్ప పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

**రామాయంపేట, డిసెంబరు 15, ప్రభాతవార్త:** రామాయంపేట పట్టణంలో 11 సంవత్సరాల క్రితం దేవాలయం నిర్మించడం జరిగిందని, ప్రతి సంవత్సరం కూడా అయ్యప్ప మాలధారులు సుమారు 80మంది వరకు మాల ధరించి నిత్యపూజలు చేయడం జరుగుతందని, అయ్యప్పస్వామి కృపాకటాక్షాలతో ఈ ప్రాంత ప్రజలతో పాటు, పరిసర ప్రాంత ప్రజలంతా కూడా సుఖసంతోషాలతో ఉండాలని మున్సిపల్ చైర్మెన్, ఆలయ గురుస్వామి పల్లె జితేందర్‌గౌడ్ అన్నారు. రామాయంపేట మండల కేంద్రంలోని అయ్యప్ప దేవాలయంలో రిటైర్డ్ ట్రాన్స్‌కో లైన్‌ఇన్‌స్పెక్టర్ రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడిపూజ ఘనంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి భజనలు, సంకీర్తనలు ఎంతగానో అకట్టుకున్నాయి. దేవాలయ ప్రాంగణమంతా అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగిపోయింది. అయ్యప్ప మహాపడిపూజకు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆలయ పూజారి కపిల్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అయ్యప్ప కృపాకటాక్షాలతో మెదక్ నియోజకవర్గం ప్రజలతో పాటు తెలంగాణ ప్రజలంతా కూడా సంతోషంగా ఉండాలని స్వామివారిని కోరుకునట్లు ఎమ్మెల్యే రోహిత్‌రావు తెలిపారు. అయ్యప్ప దేవాలయంలో రోహిత్‌ను మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్‌తో పాటు ఆలయ పూజారులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మర్కు నగేష్ గురుస్వామి, నాగరాజు గురుస్వామి, అన్నదాన ప్రభువు చంద్రపు మహేశ్వర్‌రెడ్డి గురుస్వామి, దోమకొండ చిన్న శ్రీనివాస్ గురుస్వామి, బాలు గురుస్వామి, పిసిసి అధికార ప్రతినిధి పల్లె రామచంద్రగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌదరి సుప్రభాతరావు, మామిడి సిద్ధరాములు, జహీర్‌ఖాన్, దాకి స్వామి, వెంకుగారి శ్రీధర్‌రెడ్డి, ఎనిశెట్టి అశోక్‌గుప్తా, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ 2 పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



పరీక్షలను పురస్కరించుకుని పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ క్రాంతి కుమార్

**చౌటకూరు, డిసెంబరు 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాలను అందోల్ ఆర్‌డిఓ పాండు పర్యవేక్షించారు. కమీషన్ మార్గదర్శకాలను పాటిస్తూ పరీక్షలు ప్రశాతంగా ముగిసేలా తగు చర్యలు తీసుకున్నారు. పరీక్షలకు 1512 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 753 మంది విద్యార్థులు హాజరైనట్లు, న్యూ ఉన్నాపూర్ పాలిటెక్నిక్ కళాశాలలో 432 మంది విద్యార్థులకు గాను 213 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు. మధ్యాహ్నం సెషన్‌లో 1512 మంది విద్యార్థులకు గాను 759 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేదు. సోమవారం సైతం రెండు పర్యాయాలు (ఉదయం, మధ్యాహ్నం) పరీక్షలు కొనసాగుతాయని ఆర్‌డిఓ పాండు పేర్కొన్నారు.

## స్తంభానికి ఢీ కొట్టిన బైకు

**జోగిపేట, డిసెంబర్ 15,ప్రభాతవార్త:**
అన్నాసాగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్రగాయాలైన సంఘటన ఆదివారంనాడు మధ్యాహ్నం జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫైజాబాద్ తాండాకు చెందిన శ్రీకాంత్, రవి, బాబులు బైక్‌పై వస్తూ అన్నాసాగర్ వైకుంఠదామం వద్ద స్తంభానికి ఢీకొట్టారు. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఒకరి తలకు తీవ్ర గాయాలవగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందచేస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని జోగిపేట ఎస్ఐ పాండు తెలిపారు.

## పేకాట నిందితులు ఇంకా పరారీలోనే

**కొల్చారం, డిసెంబరు 15, ప్రభాతవార్త:**
కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి శివారులోని ఏడుపాయల వనదుర్గ సమీపంలోని దుర్గాభవాని రెస్ట్‌హౌస్‌లో పేకాట ఆడుతున్న 11మందిని పట్టుకుని రిమాండ్ చేసిన విషయం తెలిసిందే. దీనికి ప్రధాన సూత్రధారులు అయిన వెంకట్ రెడ్డి, సంతోష్ సింగ్, రెస్ట్ హౌస్ యజమాని సాయి గౌడ్‌లు ఇంకా అదుపులోకి రాలేదని, వారు ఇంకా పరారీలోనే ఉన్నారని మెదక్ రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిని పట్టుకునేందుకు ముమ్మరంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

## సమాన వేతనాలు ఇవ్వాలి.ఎఐటియూసి



సమావేశంలో మాట్లాడుతున్న ఎఐటియూసి నాయకలు

**సంగారెడ్డి మున్సిపాలిటి డిసెంబరు 15,ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా లో పనిచేస్తున్న పరిశ్రమ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎండి మహబూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ కనీస వేతనాల చట్టాలున్నా అధికారులు నిర్లక్ష్యం చేస్తూన్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రతి పరిశ్రమల్లో కనీసం వేతనాలు అమలు చేయాలని, 8గంటల కల్పించాలని డిమాండ్ చేశారు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలి, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలిని, ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలి కార్మికుల పట్ల ప్రభుత్వం న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నాయకులు చిరంజీవి పాల్గొన్నారు.

## వాటర్ పోలో రాష్ట్ర జట్టుకు సంగారెడ్డి విధ్యార్థులు

**సంగారెడ్డి మున్సిపాలిటి డిసెంబరు 15,**ప్రభాతవార్త:వాటర్ పోలో రాష్ట్ర జట్టుకు సంగారెడ్డి పట్టణానికి చెందిన మొహమ్మద్ అబ్దుర్ రహ్మాన్, అలియా ఫాతిమాలు ఎంపికయ్యారని పిడి స్విమ్మింగ్ కోచ్ శేషు కుమార్ ఆదివానం ఒక ప్రకటనలో తెలిపారు.జయశంకర్ భూపాలపల్లి లో రాష్ట్రస్థాయి వాటర్ పోలో ఎంపికలను నిర్వహించారని అన్నారు..బాలల విభాగం నుండి మహమ్మద్ అబ్దుర్ రెహ్మాన్ సిద్దిఖ్, బాలికల విభాగంలో ఆలియా ఫాతిమా ఎంపికైనారు,ఈనెల 27వ తేదీన విజయవాడలో జరిగే జాతీయస్థాయిలో జరిగే పోటీలలో రాష్ట్రజట్టు తరపున పాల్గొంటారని పిడి స్విమ్మింగ్ కోచ్ శేషు కుమార్ తెలిపారు.వాటర్ పోలోలో రాష్ట్రజట్టుకు ఎంపికైనందుకు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ హర్షం వ్యక్తం చేశారు.

## వైభవంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



పడి దీపాలు ముట్టిస్తున్న స్వాములు

**శివ్వంపేట, డిసెంబరు ( ప్రభాతవార్త ) :**మండలంలోని కొంతంపల్లి గ్రామానికి చెందిన గైనిబైటి ప్రవీణ్ కుమార్ గౌడ్ గురు స్వామి నివాసంలో ఘనంగా అయ్యప్ప స్వామి మహ పడిపూజ ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. మోహన్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహ పడిపూజ జరిగింది.గణపతి పూజ, సుబ్రహ్మణ్యం పూజ,అయ్యప్ప స్వామికి అభిషేకాలు, మంగళ హారతి,మంత్రపుష్పం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహ పడిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీత రెడ్డి హాజరై దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లూరి, మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, సీనియర్ నాయకులు యాద గౌడ్, మాజీ సర్పంచులు గైనిబైటి శ్రీనివాస్‌గౌడ్,చంద్రకళశ్రీశైలం హరికృష్ణ, గురుస్వాములు ధర్పల్లి కృష్ణ, వజ్జశీను, వజ్జసత్యనారాయణ, సదాల యాదగిరి, వజ్జ రమేష్, వజ్జరాజు అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ కార్యాలయం ప్రారంభం



నియమాక పత్రాలను అందజేస్తున్న బిజెపి రాష్ట్ర నాయకులు మల్లేష్ గౌడ్

**చౌటకూరు,డిసెంబరు 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని శివంపేటలో ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ కార్యాలయాన్ని ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరత్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజురెడ్డి, శివంపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ గౌడ్, మండల సిడిఆర్ అధ్యక్షులు సంఘ భరత్‌కుమార్, నాగ మల్లన్న, మాధవరెడ్డి, చాపల శ్రీకాంత్, చాపల శివరాజ్ గౌడ్, చాపల రాజు తదితరులు పాల్గొన్నారు.

## సృజనలక్ష్మీ నగర్ కాలనీలో నూతన కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్షులుగా ఎన్నికైన గిర్నాల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**అమీన్‌పూర్, డిసెంబర్ 15 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో గల బీరంగూడ సమీపంలో ఉన్నటువంటి సృజనలక్ష్మీ నగర్ కాలనీలో ఎన్నికల ద్వారా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షులు అత్యధిక మెజారిటీతో గిర్నాల శ్రీనివాస్ గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా చాటపల్లి మధుకర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ రోడ్డు ప్రధాన రహదారులకు సంబంధించి, పెండింగ్‌లో ఉన్న అండర్ డ్రైనేజీ, విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తామని, నూతన ఆలయ నిర్మాణాన్ని చేపడతామని పేర్కొన్నారు. అంతేకాకుండా కాలనీలో ప్లే గ్రౌండ్, ఓపెన్ జిమ్, వీధి కుక్కల సమస్యను పరిష్కరిస్తామని, మంచి నీటి సరఫరా, గణేష్ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. కాలనీ వాసులు నన్ను అధ్యక్షులుగా ఎన్నుకోవడం ఎంతో గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## వధువరులను ఆశీర్వదించిన పిసిసి సభ్యులు

**మనూర్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూర్‌లోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం గ్రామానికి చెందిన ఏర్రా నర్సింహారెడ్డి కుమారుడి వివాహ వేడుకలకు పిసిసి సభ్యులు కర్నె శ్రీనివాస్ హాజరై వరువరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుభాష్‌పాటిల్, నాగేంద్రరావు, కొండల్‌రెడ్డి, శివకుమార్, బక్షిరామ్, సంగారెడ్డి, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మల్గిలో ఘనంగా మల్లన్న బోనాల జాతర

**న్యాల్‌కల్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మల్గి గ్రామంలో మల్లన్న బోనాల జాతర కనుల పండువగా కొనసాగుతున్నాయి. బోనాల జాతర ఉత్సవాల్లో మల్లన్న ఆలయ కమిటి అధ్యక్షులు, మాజీ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం మాజీ ఉపాధ్యక్షులు జెట్గొండ మారుతి, మాజీ ఎంపిటిసి సభ్యులు శివానంద శ్రీపతి, సామాజిక వేత్త కొలన్ నరసింహారెడ్డి, సిద్దారెడ్డి రాజు, విఠల్, బడక రాజు, సంజురెడ్డి, మొగులప్ప, మాణిక్, ప్రతాప్‌రెడ్డి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్‌లో గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతం

### పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ



నర్సాపూర్‌లోని బివిఆర్ఐటి కళాశాలలో నిర్వహించిన గ్రూప్ 2 పరీక్షల్లో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న అధికారుల తదితరులు

**నర్సాపూర్ డిసెంబరు 15. ప్రభాతవార్త:**నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ గ్రూప్ 2 పరీక్షలను మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగాఈ పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లు జరుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆయన సూచించారు.ఈమేరకు ఈ గ్రూప్ 2 పరీక్షల నిమిత్తం నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, ఎస్సై లింగం ల ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పరీక్షలకు హాజరై పరీక్ష హాల్‌లోకి వెళ్తున్న అభ్యర్థులను పూర్తిగా తనిఖీ చేసి లోపలికి పంపారు.ఈ పరీక్షలకు బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో మూడు బ్లాక్ లలో నిర్వహించారు. ఈ మేరకు అబ్దుల్ కలాం బ్లాక్ లో 504 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 240 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అయితే 264 మందిహాజరు కాలేదు. అదేవిధంగా విశ్వేశ్వరయ్య బ్లాక్ లో 504 మంది అభ్యర్థుల హాజరు కావల్సి ఉండగా219 మంది అభ్యర్థులు హాజరు కాగా 285 మంది హాజరు కాలేదు. అలాగే ఆర్యభట్ట బ్లాక్‌లో 503 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా కేవలం 170 హాజరు కాగా 333 మంది అభ్యర్థులుహాజరు కాలేదు.ఈ బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలోమూడు పరీక్షాసెంటర్‌లలో మొత్తం కలిపి 1511 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 629 మంది హాజరు అభ్యర్థులు హాజరయ్యారు. అయితే 882 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కాలేదు. ఈ మేరకు నర్సాపూర్ లోని బివిఆర్ఐటి లో జరిగిన గ్రూప్ 2పరీక్షలుప్రశాంతంగా,సజావుగాజరిగాయి.ఈ పరీక్షలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈపరీక్షల్లో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహాశీల్దార్ శ్రీనివాస్,సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగం, ఆర్ఐ ఫైజల్,సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన శ్రీ నల్ల పోచమ్మ ఆలయం



శ్రీ నల్లపోచమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

**కౌడిపల్లి, డిసెంబర్ 15, ప్రభాతవార్త:** తెలంగాణ రా ష్ట్రంలోని మెదక్ జిల్లాలో రెండవ అతి పెద్ద జాతరగా పేరు గాంచిన తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయం ఆదివారం నాడు భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఉదయం నుండి ఆలయం వద్ద భక్తులతో సందడిగా మారింది. ఆది వారం సెలవు దినం, చలి తీవ్రతను సైతం లెక్క చేయకుండా ఉదయం నుండి భక్తులు, పలువురు ప్రభుత్వ ఉద్యోగస్థులు సైతం తమ కుటుంబ సమేతం తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయాన్నికి పెద్ద ఎత్తున తరలివసు _న్నారు. ఆలయ ఈఓ వి.రంగారావు, ప్రధాన ఆర్చకులు శివప్పలు శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం చేసి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, కుంకుమార్చన చేసిన తర్వాత భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించగా భక్తులు ఓడి బియ్యం పోసి, ప్రత్యేక పూజలు నిర వ్రహించి, తమ మొక్కులను తీర్చుకొవడానికి పెద్దసంఖ్యలో హాజరైనారు. భక్తులు శివసత్తుల విన్యాసాల నడుమ భక్తులు బోనాలను డప్పుచప్పులతో ఆలయం చుట్టు ఊరేగించి, భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మ వారికి బోనం నైవేద్యం సమర్పించి, జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఓ వి.రంగారావు తన సిబ్బంది సహకారంతో గర్భగుడిలోకి భక్తులకు దర్శనం కల్పించారు. అటవీ ప్రాంతంలో ఆలహాదకరమైన వాతావరణంలో వెలసిన శ్రీ నల్ల పోచమ్మ ఆలయం వద్ద ప్రతి ఆదివారం నాడు చిన్న చిన్న శుభ కారా ్యలను చేస్తుండటంతో భక్తులు రద్దీ మరింత పెరిగి పోతుంది. ఆసలే వేసవి ఎండ తీవ్రత అధికంగా ఉండటం కారణంగా త్రాగు నీటికి ఏలాంటి ఆసౌర్యాలు కల్గకుండ భక్తులకు ఈఓ తన సిబ్బందితో నీటి సౌలభ్యతతో పాటు మౌళిక వసతులు కల్పించారు. కార ్యక్రమంలో ఆలయం జూనియర్ ఆసిస్టెంట్ వేంకట్ రెడ్డి, ఆలయ ప్రధాన ఆర్చకులు శివప్ప, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్య పాల్గొన్నారు.

# వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు

### గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



గోదాదేవి అమ్మవారి నూతన విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి పాత దేవాలయం పారుపల్లి వీధిలో ఆదివారం భక్తులు సహకారంతో పంచలోహలతో తయారు చేసిన గోదాదేవి అమ్మవారి నూతన విగ్రహానికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయంలో స్థిరపరిచారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా సమితి అధ్యక్షులు గంప శ్రీనివాస్, ఆలయ అధ్యక్షులు మాంకాల నవీన్‌కుమార్‌లు మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి ఉన్న వద్ద గోదాదేవి అమ్మవారు ఉండడం మంచిదన్న ఉద్దేశ్యంతో అమ్మవారిని స్వామి చెంతకు చేర్చినట్లు తెలిపారు. లోక కళ్యాణార్థం ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో ఉదయస్తమాన హారతుల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 16 నుంచి ఉదయం 6 గంటలకు ధనుర్మాసం హారతులు నిర్వహించడం జరుగుతుందని భక్తులు ధనుర్మాస పూజల్లో పాల్గొని ఆదేవాతా మూర్తుల కృపకు పాత్రులు కావాలన్నారు. కార్యక్రమంలో ఆలయ, సమితి ప్రతినిధులు, సభ్యులు పుల్లూరి శివకుమార్, కొర్తివాడ శ్రీనివాస్, కిషన్, కాచం కాశీనాథ్, శ్రీనివాస్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలతో జాతీయ రహదారి రక్తసిక్తం

### -ఈ రహదారిపై అధిక మొత్తంలో మూలమలుపులు, ఎత్తుపల్లాలు
### -ప్రతి ఆదివారం రోజు నాల్గు నుండి ఐదు రోడ్డు ప్రమాదాలు

**కౌడిపల్లి, డిసెంబర్15, ప్రభాతవార్త:**అదివారం రోజు ఉదయం నుండి సాయంత్రం 8 గంటల వరకు దాదాపుగా నాల్గు నుండి ఐదు ఘోర రోడ్డు ప్రమాదాలు సంభవించి, ఆమాయకపు వాహన చోదకుల రక్తంతో దప్పికను తీర్చుకుంటున్న 765డి జాతీయ రహదారి గుర్తుకు వచ్చి తీవ్ర జాతీయ రహదారి ఇరుప్రక్కల నివాసం కల్గిన కుటుంబీకులు, ప్రయాణించే వారి కుటుంబీకులు తీవ్ర భయాందోళనకు గురి కావాల్సి వస్తుంది. జాతీయ రహదారి నిర్మించి నేటికి నాల్గు సంవత్సరాలు పూర్తియైన ప్రతి ఆదివారం, గురు వారం నాడు ఈ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదాలు సంభవించడం పరిపాటుగా మారిపోయింది.

ఇంత జరుగుతున్న అటు జాతీయ రహదార్ల నిర్మాణ సంస్థ, ఇటు పోలీసు వ్యవస్థ ఏలాంటి నివారణ చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉంది. పైగా గుమ్మడిదల నుండి ఏడుపాయల వనదుర్గ దేవత బస్టాప్ వరకు ఈ జాతీయ రహదారిపై అధిక మొత్తంలో మూలమలుపులు, ఎత్తుపల్లాలు ఉండటంతో ఏదురుగా వేగంగా వచ్చే వాహనాల జాడ కనబడకపోవడంతో అతిదగ్గరకు రాగానే ఏదురుఏదురుగా వాహనాలు అడ్డుపడి ఢీ కోనడంతో తీవ్ర ప్రాణ, ధన నష్టం జరుగుతుంది. అసలు ఈ రహదారిని నిర్మాణం చేయడానికి ముందుగా ప్రభుత్వం సక్రమంగా సర్వే నిర్వహించినప్పటికి ఇక్కడ గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయ నాయకుల ఒత్తిడిలకు తల వచ్చి, జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ తయారు చేసి ఇచ్చిన నక్ష (లేఆవుట్)ను ప్రభుత్వం ఆమోదించిన విధంగా నిర్మాణాలు చేయడకుండా గుత్తేదారుడు ధనార్జనే ధేయ్యంగా భావించి పాత రోడ్డునే వెడల్పుగా చేసి నిర్మాణం పనులు పూర్తి చేయడం జరిగినట్లు పలువురు మేధావులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. గండిమైసమ్మ నుండి మెదక్ వరకు నిర్మించిన 765డి జాతీయ రహదారిని విజిలేన్స్ విభాగం ఉన్నతాధికారులు తనిఖీలు చేయలేక పోవడం, గుత్తేదారుడు మేజర్ పంచాయతీల వద్ద 100 మీటర్ల రోడ్డు నిర్మాణం చేసినప్పటికి, సాంకేతికంగా రోడ్డు డీవైడర్లను ఏర్పచి, వీధి ధీపాలను నిరంతరాయంగా వెల్గించడంలో తీవ్రంగా విఫలమైందున రాత్రులందు సైతం రోడ్డు ప్రమాదాలు సంభవించుతున్న దాఖాలు లేకపోలేవు. కొన్న మేజర్ పంచాయతీల మీదుగా ఈ రహదారి నిర్మాణం విషయంలో రోడ్డు అండర్ కటింగ్ కావాల్సి ఉండగా ఏలాంటి కట్టింగ్‌లు చేయకుండాగుత్తేదారుడునిర్లక్ష్యంగా నిర్మాణం పనులు చేసుకుంటుపోయాడని దీంతో కొన్ని కుటుంబాల ఇండ్లు సైతం రోడ్డుకిందికి మునిగిపోయాయి. డివైడర్ల నిర్మాణం చేసినప్పటికి సాంకేతిక పరంగా యూటర్న్ రోడ్డులను ఏర్పాటు చేయడంలో విఫలం కావడంతో రోడ్డు ఎత్తుపల్లాల కారణంగావాహనాలు అధిక వేగంగా వచ్చి ఆకస్మత్తుగా ఎదురుగా వాహనం గాని, వ్యక్తులు, పశువులు వచ్చిన రోడ్డుప్రమాదం నుండి తప్పించలేక వాహనదార్లు ఢీకొట్టి తీవ్రంగా గాయాలపాలైతున్నారు. ఈ ప్రమాదాలు ప్రతి ఆది, గురు వారాలలో జరుగుతన్నప్పటికి రోడ్డుకు అనుకొని ఉన్న పోలీస రక్షక భటు నిలయం నుండి కానిస్టెబుల్ రోడ్డుపైకి వచ్చి రోడ్డు ప్రమాదాలు ఆరికట్టడంలో తమ వంతు ప్రయత్నాలు చేయలేక పోతున్నారని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.కాగా పోలీసు కానిస్టెబుల్స్ మాత్రం స్టేషన్‌కు ఎదుట నిల్చుండి వాహానాలపై ఛలాన్లను వేయడంలో మక్కువ చూపినంత, ప్రమాదాలను ఆరికట్టుడంతో చూపించక పోవడం విడ్డూరంగా ఉందని అందరు ముక్కున వ్రెళ్ల వేసుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీస్ యంత్రాంగం, ఉన్నాతాధికారులు, జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, 765డి జాతీయ రాహదారి విషయంపై సమాలోచన చేసి పోలీస్ సిబ్బందిని ప్రతి అది, గురు వారం నాడు ఐదు కిల్లో మీటర్లకు ఒక్కరి చోప్పున బందోబస్తీగా ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు ఆయా మేజర్ గ్రామ పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

# కాలనీ సమస్యలు పరిష్కరించండి :మున్సిపల్ చైర్మన్ కు వినతి



కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం ఇస్తున్న కాలనీ వాసులు

**నర్సాపూర్ డిసెంబరు 15. ప్రభాతవార్త:**నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 9 వార్డులో గల శ్రీ వెంకటేశ్వర కాలనీ లోని సమస్యలను పరిష్కరించాలని ఆదివారం ఆ కాలనీవాసులు మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ గురు స్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు కాలనీలో మురుగునీరు కాలువల నిర్మాణం, తాగునీరు, విద్యుత్తు సరఫరా, సిసి రోడ్లు వంటి సమస్యల పైకాలనీ కమిటీ అధ్వర్యంలో ఒక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ గురు స్వామి కాలనీవాసుల పిలుపుమేరకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ కమిటీ సభ్యులందరూ కాలనీలోనెలకొన్న సమస్యలనుమున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ కు విన్నవించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ మాట్లాడుతూ శ్రీవెంకటేశ్వర కాలనీ సమస్యలను సాధ్యమైనంత త్వరలో పరిష్కారం చేస్తామని తెలిపారు.క్రమక్రమంగాప్రాధాన్యతనిచ్చి ఒక్కొక్కటిగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కాలనీవాసులందరూ కాలనీ సమస్యలను మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ కు ఇచ్చిన వినతి పత్రం లో పేర్కొన్నారు. ఈ సమావేశానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ గురుస్వామి. బిఆర్ఎస్ నాయకుడు బాల్‌రెడ్డి. పిఏసిఎస్ చైర్మన్ రాజుయాదవ్. సూరారం నరసింహులు. లను కాలనీ వాసులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీకమిటీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, బిజెపి నాయకుడు పాపగారి చిన్నరమేష్ గౌడ్. ఆంజనేయులు. అశోక్‌గౌడ్.బుచ్చానాయక్, శంకర్‌నాయక్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్రప్రభుత్వం

### సిపిఎం సెమినార్‌లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేష్



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేష్

**జోగిపేట, డిసెంబరు 15,ప్రభాతవార్త:** కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని, దీనివల్ల పోరాడి సాధించుకున్న కార్మిక హక్కుల మీద దాడి జరుగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేష్ ఆరోపించారు. ఆదివారంనాడు జోగిపేటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు-కార్మికవర్గంపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మల్లేష్ మాట్లాడుతూ దేశానికి అన్నం పెడుతున్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, సబ్సిడీ రుణాలు ఇవ్వాలని అడిగితే, రైతులకు వ్యతిరేకంగా నాలుగు నల్ల చట్టాలను తెచ్చి రైతాంగానికి నష్టం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల అవసరాలు పరిష్కరించకుండా అనునిత్యం ధరలు పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాలకు ప్రజానీకం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇందుకోసం త్వరలో జరగన్ను సిపిఎం నాల్గవ మహాసభలను విజయవంతం చేసేందుకు అందరూ తమవంతు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు జి.సాయిలు, అందోలు ఏరియా కార్యదర్శి విద్యాసాగర్, కమిటి సభ్యులు నాగభూషణం, క్రిష్ణ, రాములు, సంతు, నాయకులు సురేష్, శివకుమార్, పెంటయ్య, నరెందర్, సత్యం పాల్గొన్నారు.

## ఎర్రవల్లిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే



ఎర్రవల్లిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేస్తున్న దృశ్యం

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 15(ప్రభాతవార్త):**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో భాగంగా గజ్వేల్ పట్టణం పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ ఎర్రవల్లిలో ఆదివారం ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహించారు. గ్రామ కార్యదర్శితో పాటు ఎర్రవల్లి ఇందిరమ్మ కమిటీ సభ్యులు మన్నెం రాజశేఖర్‌రెడ్డి, కార్తిక్‌రెడ్డి తదితరులు ఈ సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ఇండ్లు లేని ప్రతి ఒక్క పేద కుటుంబానికి ఈ సర్వే నిర్వహించిన అనంతరం ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తుందని పేర్కొన్నారు. ఇల్లులేని ప్రతి పేద కుటుంబానికి ఇల్లు ఇవ్వాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

### క్రమశిక్షణ,పట్టుదలతో,చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

**: చిన్నకోడూరు, డిసెంబరు 15, ప్రభాతవార్త** :మండల కేంద్రంలోని చిన్నకోడూరు ఎస్సీ బాలుర వసతిగృహంలో అదే గ్రామానికి చెందిన ప్రముఖ డాక్టర్ రామచంద్రరావు విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ చలి కాలంలో విద్యార్థులు చలితో బాధపడకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.వసతిగృహాలలో చదువుకునే పేద విద్యార్థులు చిన్న తనం నుంచే క్రమశిక్షణ,పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. వసతి గృహాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రతి నిరుపేద విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ రవి, సిబ్బంది మల్యాల లక్ష్మణ్, ఆసుపత్రి సిబ్బంది తిరుపతి తదితరులు

### ఆత్మీయానురాగాలు పంచుకున్న పూర్వ విద్యార్థులు

**మిరుదొడ్డి, డిసెంబరు 15, ప్రభాతవార్త** :మండల కేంద్రంలోని మిరుదొడ్డిలో 1986-87 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆత్మీయ అనురాగాలు పంచుకున్నారు. విద్య బుద్దులు నేర్పిన గురువులను శాలువాలతో మెమొంటోలతో ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేలేటీ మృత్యుంజయశర్మ, పృథ్వీరాజ్, రుస్తుంతో పాటు పూర్వ విద్యార్థులు గొట్టం కోటేశ్వర్, లింగాల రాజలింగారెడ్డి, మంచాల చంద్రం, గరిపల్లి శ్రీనివాస్, అల్లాడి శ్రీనివాస్, నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి, వల్లాల సత్యనారాయణ, సత్తు గోవర్దన్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, గున్నాల భిక్షపతి, వరప్రసాద్,అకుల మోహన్, చెన్నప్ప, మద్దెల లక్ష్మణ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

### ఆంజనేయస్వామి ఆలయ 3వ వార్షికోత్సవం

**అల్లాదుర్గం, డిసెంబరు 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయ 3వ వార్షికోత్సవ ఉత్సవాలను ఆదివారం భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయంలో ఆలయ అర్చకులు ఉదయం విగ్రహానికి చందన లేపనం చేసి తమలపాకులు, రంగు రందు పూలతో ఆందంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులను స్వామి వారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తలకు తీర్ధ ప్రసాదాలు అందచేశారు. ఆలయ పరిసరాలను శ్రీరాముడు, ఆంజనేయస్వామి నామస్మరణతో మార్మోగింది.

### సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

**మునిపల్లి, డిసెంబరు 15, ప్రభాతవార్త:** గత 9 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యూలర్ చేయాలని పిఆర్‌టియు ఒడల ప్రధాన కార్యదర్శి దర్గిగంధం మల్లికార్జున్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు ఆదివారం మల్లికార్జున్ మద్దతు పలికి సంఘీభావం వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాలుగా కనీస వేతనాలు అందకున్నా పనులు చేస్తూ వచ్చిన ఉద్యోగులకు న్యాయం చేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. సమ్మె చేస్తున్న కెజిబివి, సమగ్ర శిక్షన ఉద్యోగలకు పిఆర్‌టియు తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కెజిబివి ఎస్ఓ కవితి, ఎంఐఎస్ నరేష్, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

### కేంద్రహోంశాఖ సహాయ మంత్రికి కలెక్టర్ స్వాగతం



కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సంజీయ్‌కి పూల మొక్కనునఅందజేస్తున్న జిల్లా కలెక్టర్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్ర తి ని ధి :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని ఆదివారం హరిత మినర్వా హోటల ్లో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి మర్యాద పూర్వకంగా కలిసిపూల మొక్కను అందించారు. కార్యక్రమంలో ఏసీపీ మధు ఉన్నారు.

## స్థానిక ఎన్నికల్లో బిజెపి విజయం ఖాయం
### -మాదాడి జశ్వంత్‌రెడ్డి


: సమావేశంలో మాట్లాడుతున్న మాదాడి జశ్వంత్‌రెడ్డి

**గజ్వేల్, డిసెంబరు 15 (ప్రభాతవార్త):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి విజయకేతనం ఎగురవేస్తుందని బిజెపి సీనియర్ నాయకుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో బిజెపి కార్యాలయంలో మాదాడి జశ్వంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడి సారధ్యంలో భారతదేశం ముందడుగు వేస్తుందని పేర్కొన్నారు. బిజెపి పార్టీతోనే దేశంలో అభివృద్ధి సాధ్యమైందని, ప్రధాని నరేంద్రమోడి చేపట్టిన సంక్షేమ పథకాలే సిద్దిపేట జిల్లాలో బిజెపి జెండా ఎగరడానికి దోహదపడుతుందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బిజెపి అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డులలో బిజెపి అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొన్నె రాజిరెడ్డి, హైదర్ ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత అల్పాహారం పంపిణీ


అల్పాహారం పంపిణీ చేస్తున్న కాశమైన సందీప్

**గజ్వేల్, డిసెంబరు 15 (ప్రభాతవార్త):** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం గజ్వేల్ ప్రభుత్వా సుపత్రి ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్ నేతి శ్రీనివాస్,లయన్ భాస్కర్‌లు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని నాలుగు సంవత్సరాల నుండి ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉదయం అల్పాహార పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువనాయకుడుకాశమైన సందీప్‌పుట్టినరోజుసందర్భంగా అల్పాహారంతో పాటు బ్రెడ్,అరటిపండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్‌స్నేహ అధ్యక్షుడు మల్లేశంగౌడ్, దొంతుల సత్యనారాయణ, రాము పాల్గొన్నారు.

## అయ్యప్ప అనుగ్రహంతో అందరూ బాగుండాలి
### -పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి


అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

**ములుగు,డిసెంబరు15 (ప్రభాతవార్త):** అయ్యప్పస్వామి అనుగ్రహంతో రాష్ట్రంలో ఉన్న ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి కోరారు. ఆదివారం ములుగుమండలంనాగిరెడ్డిపల్లి గ్రామంలో చల్ల నరసింహారెడ్డి గురుస్వామి అయ్యప్ప మాలధారణ వేసుకొని 18 సంవత్సరాలు పూర్తికావడంతో మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, నాయకులు జుబేర్‌పాషా, కొమ్ము నవీన్, భూపాల్‌రెడ్డిలు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా మహా పడిపూజకు వివిధ గ్రామాల నుండి పెద్దసంఖ్యలో తరలివచ్చిన అయ్యప్ప స్వాములు చేసిన భజనలు, అయ్యప్పనామస్మరణ గ్రామంలో మారుమ్రోగాయి. పడిపూజను తిలకించేందుకు అయ్యప్పభక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమానికివిచ్చేసిన భక్తులకు, అయ్యప్ప స్వాములకు చల్లనరసింహారెడ్డి ఆధ్వర్యంలోతీర్థప్రసాదాలతోపాటు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామనాయకులు, ప్రజలు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసి జిల్లా నాయకులు చిరంజీవి

**నారాయణఖేడ్, డిసెంబరు 15 ప్రభాతవార్త:** ఉమ్మడి జిల్లాలోని ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు సమాన పని సమాన వేతనాలు రూ.26 వేలు కనీస వేతనం చెల్లించాలని ఏఐటీయూసి జిల్లానాయకులు చిరంజీవి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణఖేడ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి,మెదక్‌జిల్లాలోనిఆయాపరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయా లని ఆయన అన్నారు. కనీస వేతనాలు అమలుచేయాలని చట్టాలున్న అధికారుల నిర్లక్ష్యం వల్లకార్మికులకు అందలేకపోతున్నాయని, ప్రతి పరిశ్రమల్లో కార్మికులకు 8గంటల ఉద్యోగ సమయం కల్పించాలని ఆయన అన్నారు. ఈఎస్‌ఐపీహెచ్ సౌకర్యాలుకార్మికులకు ప్రభుత్వం కల్పించి ప్రభుత్వం న్యాయమైన సమస్యల పరిష్కా రానికి కృషి చేయాలని అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

## బూత్ అధ్యక్షులుగా సురేష్ నియామకం


బూత్ అధ్యక్షులుగా నియామక పత్రం అందుకుంటున్న సురేష్

**కొల్చారం, డిసెంబర్ 15 ప్రభాతవార్త:** కొల్చారం మండల పరిధిలోని పైతర గ్రామంలో బూత్ నెంబర్ 66లో ఆదివారం బూత్ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ బూత్ అధ్యక్షులుగా సురేష్,

# నవోదయలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**వర్గల్, డిసెంబరు 15 (ప్రభాతవార్త):** వర్గల్ మండల పరిధిలోని జవహర్ నవోదయవిద్యాలయంలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. నవోదయ విద్యాలయ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ అంచురి రమేష్‌లు కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. సమ్మేళనం కార్యక్రమంలో మొదటి బ్యాచ్ నుంచి చివరి బ్యాచ్ వరకు ఉన్న విద్యార్థులు అందరూ హాజరుకాగా శ్రీ మీరు హాస్పిటల్స్ అధినేత వెంకటరెడ్డి కార్యక్రమానికి అవసరమైన సహాయ సదుపాయాలను ఏర్పాటు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా జవహర్ నవోదయ విద్యార్థులు చేసిన నెమలి నృత్యం, బిహునృత్యం ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించాయి. పూర్వ విద్యార్థులైన సిఐ రాజు, విద్య, అరుణ, రజినిల పిల్లలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు కార్యక్రమానికి వన్నె తెచ్చాయి. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే కూచిపూడి నృత్యం గణనాయకాయ కనుల పండువ చేసింది. పూర్వ విద్యార్థి రోహిత్ పాడిన పాటలు వీనుల విందుగా ఉన్నాయి. సైఫ్ గిటార్‌వాదన సంగీత సముద్రంలో ఓలలాడించింది. పూర్వ విద్యార్థులందరూ తమపాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటి వరకు సంఘం తరఫున విద్యాలయానికి చేసిన సేవా కార్యక్రమాలను వివరించారు. ఆర్థిక పరమైన అంశాలను కూడా తన ఉపన్యాసంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సభ్యులందరూ ప్రస్తుత నవోదయ సిబ్బందిని జ్ఞాపికలతో సన్మానించడంతో పాటు 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను


15జీజేఎల్6: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు
15జీజేఎల్7: పూర్వ విద్యార్థులతో కలిసి జ్యోతిప్రజ్వలన

ఆవిష్కరించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా 2023-24 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను ప్రధానం చేశారు. 12వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన యాదగిరి, పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన మేఘన, వైష్ణవిలకు నగదు ప్రోత్సాహకాలు ఇచ్చి ఉత్తేజపరిచారు. కాగా నవోదయ విద్యార్థులు పూర్వ విద్యార్థులకు కొవ్వొత్తుల వెలుగులతో వీడ్కోలు పలికారు. సమ్మేళన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినందుకు గానూ పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులకు, సభ్యులకు విద్యాలయ సిబ్బందికి ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ ధన్యవాదాలు తెలిపారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**సిఐటియూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి**

**శివ్వంపేట,డిసెంబర్ 15 ( ప్రభాతవార్త ):** సమగ్ర శిక్షఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆసంఘం నాయకులను చర్చలకు పిలవాలని సమ్మెను విరమింప చేసేందుకు చర్యలుచేపట్టాలని కోరారు.

సమగ్ర శిక్షలో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, పేస్కేల్ ఇవ్వాలనికోరుతూ గకొన్ని రోజులుగాసమ్మె చేస్తున్నా రన్నారు. జిల్లాస్థాయిలో ఏపీఓ, సిస్టమ్ అనలిస్ట్, టెక్నికల్ పర్సన్లు, ఆపరేటర్లు, డిఎంఎంటి మెసెంజర్లు, మండల స్థాయిలో ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈ ఆర్పీఎస్, మెసెంజర్లు, స్కూల్‌కాంప్లెక్స్ స్థాయిలో సిఆర్పిలుగా, పాఠశాస్థాయిలో పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లు (ఆర్ట్, పిఈటీ, వర్క్ ఎడ్యుకేషన్)గా కేజీబీవీ యూఆర్‌యస్‌లలో, స్పెషల్‌ఆఫీసర్లు పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, పిఈటీలు, ఏఎన్ఎం, అకౌంటెంట్లు ,క్రాఫ్ట్, కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్లు ,కుక్‌వాచ్ ఉమన్లు, స్వీపర్లు, స్కావెంజర్లు, 18ఏండ్లుగా అతి తక్కువ వేతనాలకేపని చేస్తున్నారన్నారు. ఏండ్లు గడుస్తున్న ఒకేవేతనం తప్ప పెరుగుతున్న నిత్యవసరాలు అనుగుణంగా వేతనం పెంచడం లేదని అన్నారు. కనీసం ఆరోగ్య కార్డులు, మహిళలకు ప్రసుతి సెలవులు, జీవిత బీమాచనిపోయినఉద్యోగ కుటుంబాలకు ఎక్స గ్రేషయా, అర్హులైనవారికి ప్రత్యామ్నాయ ఉద్యోగం వంటి చట్టబద్ధ సౌకర్యాలుఅమలు కావడం లేదన్నారు.

వారంతా ఆర్థికంగా, సామా జికంగా వెనుకబడిన వర్గాలకి చెందిన వారన్నారు. ప్రభుత్వం ప్రతిపక్షంగా ఉన్నప్పుడు వారిసమస్యలు పరిష్కరిస్తానంటూ హామీ ఇచ్చారూ అన్నారు. ప్రభుతా ్వనికి ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించక పోవడంతో నిరవధిక సమ్మెకు పోనుకున్నారని అన్నారు. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించివారిని రెగ్యులరైజ్ చేయా లని, పేస్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీమా సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ 25లక్షల ఇవ్వాలని,ప్రభుత్వ నియమాకాలో వెయిటేజ్ కల్పించాలని కోరారు. రిఎంగేజ్ విధానాన్ని రద్దు చేయాలని ఇతర న్యాయమైన సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలన్నారు ప్రభుత్వాని కోరారు.

## నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
### -ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్


మాట్లాడుతున్న ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 15 (ప్రభాతవార్త):** నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గాజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్‌తో కలిసి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా సర్దార్‌ఖాన్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 6 గ్యారంటీలు దశల వారీగా నెరవేరుస్తుందని, ఇల్లు లేని నిరుపేదలకు ప్రజాపాలనలో దరఖాస్తులు పెట్టుకున్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ప్రభుత్వం అందజేస్తుందని, ఇంటింటి సర్వేకు వచ్చే అధికారులకు లబ్ధిదారులు సహకరించాలని కోరారు. బిఆర్‌ఎస్ పార్టీ కేవలం మాటలకే పరిమితమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పరిపాలన చేస్తూ అందరి మన్ననలు పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సబ్బని నరేష్, సాహేద్, గుంటుకు యాదగిరి, అజ్గర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పరస్పరం దాడులు అవాస్తవం

**సంగారెడ్డి మున్సిపాలిటి డిసెంబరు 15,ప్రభాతవార్త:** గిర్మాపూర్ సాంఘిక సంక్షేమ బాలురగురుకుల పాఠశాలలో విద్యార్థులు పరస్పరం దాడులు చేసుకున్నారు అనడంలో వాస్తవం లేదని సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్ రెడ్డి అన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదవ తరగతి, ఆరవ తరగతి విద్యార్థులు పరస్పరం దాడి చేసుకున్నారని వదంతులు వ్యాప్తి చెందడంతో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు సంగారెడ్డి ఆర్ డి ఓ రవీందర్ రెడ్డి, సంగారెడ్డి డిఎస్పి సత్య గౌడ్‌లు ఆదివారం గిర్మాపూర్ సాంఘికసంక్షేమ గురుకులపాఠశాలలోవిద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులను వేరువేరుగా విచారణ జరిపారు. పాఠశాలలో ఎలాంటి దాడి సంఘటనలు జరగలేదని ఆర్డీఓ తెలిపారు. వారం రోజులకు ఒకసారి స్థానిక తహసిల్దార్, ఎస్సైలు పాఠశాలను సందర్శించి విద్యార్థుల తో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించినట్లు ఆర్డీవో తెలిపారు. వదంతులను నమ్మొద్దని విద్యార్థులకు విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆర్డీవో సూచించారు.

## ఆమ్ ఆద్మీపార్టీ పటిష్టానికి బూత్‌స్థాయి కమీటిలు

సంగారెడ్డి మున్సిపాలిటి డిసెంబరు 15,ప్రభాతవార్త:సంగారెడ్డి జిల్లాలో ఆమ్ ఆద్మీ పార్టీని బలోపేతం చేయడానికి బూత్ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మిట్టపల్లి రాజేశ్వర్ తెలిపారు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశామని, అనంతరం మండల.బూత్ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తుందని అన్నారు. నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు బొంగుల ఉమారాణి మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీని నియోజకవర్గంలో పటిష్ట పరచడానికి ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తామని అన్నారు.ఆమ్ ఆద్మీ పార్టీలో చేరడానికి విద్యావంతులు, విద్యార్థులు అధిక సంఖ్యలో ఆసక్తి చూపుతున్నారని అన్నారు.

## ఘనంగా దత్తజయంతి ఉత్సవాలు


దత్తగిరి ఆశ్రమంలో హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఝరాసంగం, డిసెంబరు 15, ప్రభాతవార్త:** జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లు తున్న మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమంలో ఆదివారం దత్తజయంతి ఉత్సవాలు కనుల పండువగా కొనసాగాయి. జయంతి ఉత్సవాలు ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవదూతగిరి మహారాజ్ (అప్పగారు), డాక్టర్ మహంత్ సిద్దేశ్వర స్వామి ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ఆశ్రమ ఆవరణలో శ్రీ దత్త జయ్ఞం, చండి గాయత్రి యజ్ఞం వేద మంత్రాలు వల్లిస్తుండగా శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం దత్తాత్రేయుడికి అభిషేకం, మహా మంగళ హారతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యల పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

**-జయంతి ఉత్సవాలకు మాజీ ఎంపి బిబి పాటిల్...**

బర్దీపూర్‌లో దత్తగిరి ఆశ్రమంలో ఆదివారం నిర్వహించిన దత్తజయంతి ఉత్సవాలకు మాజీ ఎంపి బిబి పాటిల్ హాజరు కాగా ఆశ్రమ మర్యాదలతో మాజీ ఎంపికి పూర్ణకుంబంతో స్వాగతం పలికారు. ఆశ్రమంలో బిబి పాటిల్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తగు ఏర్పాట్లు చేశారు.

## బోరంచలో మల్లన్న పండగ సంబరాలు


బోరంచలో మల్లన్న పండగ సంబరాలు

**మనూర్, డిసెంబరు 15,** ప్రభాతవార్త: మండల పరిధిలోని బోరంచ గ్రామంలో ఆదివారం మల్లన్న పండగను భక్తులు పసందుగా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని పురవీధుల గుండా బోనాలను డోలువాయిస్తూ ఆటపాటలుఆడుతూఊరేగించడంఆకట్టుకుంది. వేడుకలకు హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పోచగొండ, నాగ్‌గొండ, మండల కురుమ సంఘం ఉపాధ్యక్షులు బీరప్ప,రమేష్, మల్లేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

# అంబులెన్స్ మంజూరుకు కృషి చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు

### -మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్

**కొల్చారం,డిసెంబర్ 15 ప్రభాతవార్త:** అడిగిన వెంటనే కొల్చారం మండలానికి 108 అంబులెన్స్ మంజూరు చేసిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్‌రాజనర్సింహకు కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 108 అంబులెన్స్ మంజూరుకు సహకరించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డిలకు సైతం ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటి వరకు కొల్చారం మండలానికి 108 అంబులెన్స్‌లేకపోవడంతో మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ప్రమాదాలు జరిగితే ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు.

నర్సాపూర్ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి రాజిరెడ్డి ద్వారా కొల్చారం మండలానికి 108 అంబులెన్స్ మంజూరుకు కృషి చేసిన వారికి ఎల్లవేళలా కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ కృతజ్ఞతలతో ఉంటుందని తెలిపారు.


మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్

## ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

**నారాయణఖేడ్, డిసెంబరు 15 ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్ర విభజన తర్వాత ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయలేదని నారాయణఖేడ్ ఎస్టీసెల్ మండల అధ్యక్షులు గోవింద్ నాయక్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీఎస్టీల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తి చేయ లేదని అన్నారు. మనముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిప్రత్యేక చొరవచూపి ఆయా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేస్తే ఎస్టీ, ఎస్సీ నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలుపొందే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న జాబ్ క్యాలండర్ ప్రకారం డీఎస్సీ, ఇతర నోటిఫికేటషన్ల మాదిరిగా ఎస్టీ, ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులుభర్తీచేయాలని ఆయన ప్రభుత్వానికి కోరారు. ఈ కార్యక్రమంలో కిషన్,బాబు,శంకర్ పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న జీఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ గుర్రపు మశ్చేందర్

**కల్హేర్, డిసెంబరు 15 ప్రభాతవార్త:** కల్హేర్ మండల పరిధిలోని మార్ది తండాకు చెందిన వేముల నాయక్ ఉంటున్న నివాసం నిప్పంటుకుని ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఆదివారం ఇల్లు కాలిపోయిన విషయం తెలుసుకుని అగ్ని ప్రమాదంలో పూర్తిగా ఆస్తిని కోల్పోయిన కుటుంబానికి జీఎంఆర్ ఫౌండేషన్‌ఛైర్మన్ గుర్రపు మశ్చేందర్‌తరపున కొంత ఆర్థిక సాయాన్ని సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ గుర్రపు సుశీల అంజయ్య,కృష్ణాపూర్‌తాజామాజీఎంపీటీసీ ఉప్పరి అంజయ్య సాగర్, కృష్ణాపూర్ తాజా మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చిన్నారెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాస్, నర్సింలు పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు

**సిర్గాపూర్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో కొలువున్న మల్లన్నదేవాలయంలో ఆదివారం ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం దేవాలయంలో యాదవుల ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా బీర్ల కళాకారులతో డోలు చప్పుళ్లతో నృత్యాలు చేస్తూ మల్లికార్జున జీవిత చరిత్రను భక్తులకు వినిపించారు. ఆలయ ఆవరణలో మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం నేత్ర పర్వంగా నిర్వహించారు. మల్లికార్జున స్వామికి బోనాలు సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాద వితరణను స్వీకరించారు.

## మండలంలో రాతికట్ట నిర్మాణ పనులు


సిర్గాపూర్‌లో రాతి కట్టల నిర్మాణ పనుల దృశ్యం

**సిర్గాపూర్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కిషన్ నాయక్ తండాలోని గిరిజన రైతులు గట్టు ప్రాంతాల భూములలో రాతి కట్టల నిర్మాణం పనులు ముమ్మరంగా చేపడుతున్నారని కంగ్టి వాటర్ షెడ్ టెక్నికల్ అధికారి సుధాకర్ నాయక్ తెలిపారు. కంగ్టి వాటర్ షెడ్ ద్వార పేద రైతుల భూములను అభివృద్ధి చేసేందుకు నీరు, మట్టి సంరక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రైతుల భూముల్లో వర్షానికి మట్టి కొట్టుకుపోకుండా రాతి కట్టలను నిర్మిస్తున్నామన్నారు.

## దత్తజయంతి ఉత్సవాల్లో కార్పోరేటర్ సింధూ


దత్తజయంతి ఉత్సవాల్లో పాల్గొన్న కార్పోరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, డిసెంబరు 15, ప్రభాతవార్త:** భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజి కాలనీలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం దత్త జయంతి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. జయంతి ఉత్సవాలకు కార్పోరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. జయంతి ఉత్సవాలకు చేరుకున్న కార్పోరేటర్‌ను ఆలయ కమిటి బాధ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లింగంపల్లి కార్పోరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, ఆలయ కమిటి సభ్యులు అనిత ప్రసాద్, సావిత్రి,మాజీ డైరెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## మల్లన్న జాతర కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**నారాయణఖేడ్,డిసెంబరు 15ప్రభాతవార్త:** అంగరంగ వైభవంగా కొనసాగుతున్న మల్లన్నస్వామి మందిర జాతర కళ్యాణోత్సవ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి హాజరయ్యారు.ఆదివారం జరిగి మల్లన్న స్వామి మందిర స్వామిజాతర కళ్యాణోత్సవం ప్రత్యేక పూజ కార్యక్రమంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డితో పాటు రాష్ట్రకార్పోరేషన్ మాజీ ఛైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ హాజరై ప్రత్యేక పూజలుని ర్వహించి తమమొక్కుబడులనుచెల్లించు కున్నారు.ఈ కార్యమంలో మాజీ ఎమ్మెల్యే కూతురు యువనాయకురాలు శ్రేయరెడ్డి, మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, గ్రామ తాజా మాజీ సర్పంచ్ రాజు, ఉప సర్పంచ్ సిద్దు, మండల పార్టీఉపాధ్యాక్షులు నర్సింలు యాదవ్, నాయకులు జ్ఞానేశ్వర్, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.


## CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ I, **KOTHURI VIJAYA SHANTHI** (Old Name) W/o **Chakilam Santhosh Kumar**, resident of D.No.20-63/4, Vivekananda Colony, Near Annapurneshwari Temple, Siddipet, Telangana-502103. I have changed my name as **CHAKILAM VIJAYA SHANTHI** (Newname) W/o **CHAKILAM SANTHOSH KUMAR** here after my name is known **CHAKILAM VIJAYA SHANTHI** (New Name) W/o **CHAKILAM SANTHOSH KUMAR.**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్రం



సెమినార్‌లో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేష్

**జోగిపేట, డిసెంబరు 15, ప్రభాతవార్త:** కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్రప్రభుత్వం పనిచేస్తుందని, దీనివల్ల పోరాడి సాధించుకున్న కార్మిక హక్కుల మీద దాడి జరుగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేష్ ఆరోపించారు. ఆదివారంనాడు జోగిపేటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు-కార్మికవర్గంపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మల్లేష్ మాట్లాడుతూ దేశానికి అన్నం పెడుతున్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, సబ్సిడీ రుణాలు ఇవ్వాలని అడిగితే, రైతులకు వ్యతిరేకంగా నాలుగు నల్ల చట్టాలను తెచ్చి రైతాంగానికి నష్టం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల అవసరాలు పరిష్కరించకుండా అనునిత్యం ధరలు పెంచుతూ ప్రజల నడ్డివిరుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాలకు ప్రజానీకం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇందుకోసం త్వరలో జరగన్ను సిపిఎం నాల్గవ మహాసభలను విజయవంతం చేసేందుకు అందరూ తమవంతు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు జి.సాయిలు, అందోలు ఏరియా కార్యదర్శి విద్యాసాగర్, కమిటి సభ్యులు నాగభూషణం, క్రిష్ణ, రాములు, సంతు, నాయకులు సురేష్, శివకుమార్, పెంటయ్య, నరేందర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమల్లన్నస్వామి మందిరంలో ప్రత్యేక పూజలు



శ్రీమల్లన్న జాతరలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న శ్రీమల్లన్నస్వామి మందిర జాతర, కళ్యాణోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. శ్రీమల్లన్నస్వామి జాతర పూజ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం డీసీసీ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్‌రెడ్డి, పి.సుధాకర్‌రెడ్డి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధారరెడ్డి తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసంవత్సరం కూడా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డికి శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల ప్రజలు భక్తిశ్రద్దలతో పాల్గొని తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో అనంతసాగర్ కిటకిటలాడింది. వచ్చిన భక్తుల కొరకు ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట శివరాథోడ్ తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యాక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కె.భోజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు పండరిరెడ్డి, శ్రీనివాస్‌రెడి ఎన్ఎస్‌యుఐ ఉపాధ్యక్షులు, శ్రీకాంత్, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు ఉన్నారు.

## ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్



సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

**గజ్వేల్/గజ్వేల్ టౌన్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉక్కు మనిషి అని, భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రిగా ఎన్నో సేవలు అందించారని మహనీయుల విగ్రహాల ఏర్పాటు కమిటీ, హైందవ సోదరులు పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, డాక్టర్ నరేష్‌బాబు, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మాదాసు శ్రీనివాస్, పురోహితుడు రాజశేఖరశర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర సమరయోధునిగా స్వాతంత్రం అనంతరం హైద్రాబాద్, జునాగడ్ లాంటి సంస్థానాలు దేశంలో విలీనం కావడానికి కృషిచేసిన గొప్ప మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని, వారి ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గజ్వేల్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కౌన్సిలర్ రహీం, నాయిని యాదగిరి, సుభాష్‌చంద్రబోస్, శీర్ల మల్లేశ్, బుక్క రమేష్, ఉప్పల ప్రవీణ్, సుంకరి బాల్‌కుమార్, రమణ, పాత రాజు, జంగం రమేష్‌గౌడ్, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు ప్రేమ్, కుడిక్యాల రాములు, అరవింద్, సురేష్, మహేష్, రాజేశం, ఉపాధ్యాయులు మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప అనుగ్రహంతో అందరూ బాగుండాలి



అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి

**ములుగు, డిసెంబరు 15, ప్రభాతవార్త:** అయ్యప్పస్వామి అనుగ్రహంతో రాష్ట్రంలో ఉన్న ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి కోరారు. ఆదివారం ములుగు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో చల్ల నరసింహారెడ్డి గురుస్వామి అయ్యప్ప మాలధారణ వేసుకొని 18 సంవత్సరాలు పూర్తి కావడంతో మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, నాయకులు జుబేర్‌పాషా, కొమ్ము నవీన్, భూపాల్‌రెడ్డిలు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# శ్రీలక్ష్మీ అనంతపద్మనాభస్వామి పునశ్చరణ మహోత్సవాలు

### -హాజరుకానున్న మంత్రి దామోదర్

**చౌటకూరు, డిసెంబరు 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని క్రియాల్‌లో కొలువుఉన్న శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి పునశ్చరణ మహోత్సవాలను ఈ నెల 16వ తారీఖు నుంచి 18వ తేదీ వరకు నిర్వహించేందుకు తగు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పరిపూర్ణ దేవాలయం, భవ్యమైన ఆలయ మహా మండ పాలను ఆలయ పాలక వర్గం ఆధ్వర్యంలో రంగు రంగు పూలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మూడు రోజుల పాటు కొనసాగే ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ హాజరుకాను న్నారు. 16వ గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షాదారణ, యాగశాలప్రవేశం, మాతృక, యోగినీ, వాస్తు, క్షేత్ర పాలక, నవగ్రహ, సర్వతో భద్ర మండల దేవతా ఆవాహనం, ప్రధాన కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, గణపతి హోమం, ప్రతి మాశోధనం, మహాపకపసపం. జలాధివాసం, తీర్ధ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటి ఛైర్మన్ భానూరి లక్ష్మయ్య తెలిపారు. 17న ఆవాహిత దేవతా పూజ, ఆవాహిత దేవాత హవనచములు, మూల మంత్ర, హవనములు, సంపుటిత పంచసూక్త హవనములు, ధాన్యాది వాసము, ప్రాసాద సంస్కారం, న్యాస హోమాలు, విశేష ఫల, పుష్ప, శయ్యాధివాస పూజ తీర్ధ ప్రసాదవితరణ కార్యక్రమం నిర్వహిస్తాన్నారు. 18న గర్త, బీ, రత్న, ధాతు న్యాసములు, పుష్యమి నక్షతయుక్త మకరలగ్న పుష్కరాంశ సుమూహార్మమున యంత్ర ప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, ధ్వజ స్థాపన ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, జీవకళాన్యాసములు, పూర్ణాహుతి, మహాభిషేకం, మహాదాశీర్వన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఛైర్మన్ భానూరి లక్ష్మయ్య వివరించారు.



ఆలయంలో కొలువున్న లక్ష్మిఅనంత పద్మనాభ స్వామి

## బియ్యంకు బదులు నగదు

**గజ్వేల్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదల ఆకలి తీర్చేందుకు రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం అందజేస్తుండగా రేషన్ డీలర్లు మాత్రం లబ్ధిదారులకు ఇవ్వకుండా నగదును చెల్లిస్తూ బియ్యంను దళారులకు విక్రయిస్తున్న వైనం ఇది... గజ్వేల్ మండల పరిధిలోని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌తో పాటు పలు గ్రామాల్లో ఉన్న కొందరు రేషన్ డీలర్లు లాభార్జనే ధ్యేయంగా రేషన్ షాపులను నడిపిస్తున్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ షాపులకు వచ్చే ఉచిత బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సివుండగా రేషన్ షాపుకు వచ్చే కొందరు లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా నగదును చెల్లిస్తూ బియ్యంను పక్కదారి పట్టిస్తున్నారు. కిలోకు రూ.10 చొప్పున కొనుగోలు చేస్తూ రూ.16లకు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. దళారులకు డీలర్లకు మధ్య సయోధ్య కుదుర్చుకొని లాభార్జనే ధ్యేయంగా రేషన్ డీలర్లు పనిచేస్తున్నారు. కొందరు రేషన్ డీలర్లు ఏకంగా షాపు వద్ద మధ్యవర్తిని పెట్టుకొని రేషన్ బియ్యంను కొనుగోలు చేసి దళారులకు విక్రయిస్తున్నారు. నిరుపేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న బియ్యం దళారుల చేతికి వెళ్ళడంతో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. రేషన్ డీలర్లకు ప్రభుత్వం కమీషన్ ఇస్తున్నప్పటికీ వారికి వచ్చే బియ్యంను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. అక్కడక్కడ అడపా దడపా తనిఖీలు నిర్వహించినప్పటికీ రేషన్ డీలర్ల అక్రమ దందాను అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం రైస్ మిల్లులలో, చిన్న చిన్న వ్యాపారస్తుల వద్ద కనిపిస్తున్నాయి. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో రెండుమూడు రేషన్ షాపులు ఉండగా గజ్వేల్ మ ండలకేంద్రంలో బియ్యం వ్యాపారం యధేశ్చగా కొనసాగుతుంది. ఇదిలా ఉండగా గజ్వేల్‌తో పాటు గ్రామాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు మహిళలు నూకలు, జొన్నలు తదితర వాటిని కొనుగోలు చేస్తామంటూ తిరుగుతూ రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలుచేసి ఆటోల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్ల బ్లాక్ దందాకు చెక్ పట్టాల్సిన అవసరం ఉందని, అధికారులు అడపా దడపా తనిఖీలు చేయకుండా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తే రేషన్ డీలర్ల బాగోతం బయటపడుతుందని ప్రజలు కోరుతున్నారు.

## నిధులకు శ్రీకారం...ఆగిపోయిన గ్రహచారం



ప్రత్యేక నిధులతో నిర్మించినా వాడుకలోలేని మరుగుదొడ్లు

**పాపన్నపేట, డిసెంబరు 15, ప్రభాతవార్త:** కోట్ల నిధులు వెచ్చించి సము దాయ నిర్మాణ పనులు అర్ధాంతంగా ఆగిపోవడంతో దేవాదాయ ధర్మాదాయశాఖకు వచ్చే ఆదాయం తగ్గే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గాభవానీమాత దేవాదాయ ధర్మాదా శాఖ ఆదాయ వనరులు మెరుగుపర్చడంతో పాటు శాఖకు ఆదాయ వనరులుగా మారుతాయని తలంచి 2021 సంవత్సరంలో మూడు కోట్ల రూపాయలతో 12 దుకాణాల ఏర్పాటు చేసి వాటిపై దాతల సహకారంతో విడదిగృహాలు ఏర్పాటు చేయాలని తలంచి సెల్లార్‌తో కూడిన సముదాయాలకు ప్రతిపాదనలు చేసి కమిషనర్‌తో అనుమతులు పొంది దేవాదాయ ధర్మాదాయశాఖ నిధులతో నిర్వహించిన టెండర్లను దక్కించుకున్న గుత్తేదారు 2021లో అప్పటి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో భూమి పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. అయితే నిధులు సరిపోకపోవడంతో మరో కోటినిధులను వాడుకోవడానికి అనుమతులు సైతం మంజూరుచేశారు. అయినా సదరు గుత్తేదారు పనులు పూర్తి చేయడంలో విఫలం అయ్యారు. గత ఏడాదిగా పనులు సాగకపోగా అర్ధాంతరంగా ఆగిన నిర్మాణాలు ఉత్సవ విగ్రహాలుగా దర్శనమిస్తున్నాయి. ఆలయ కార్యనిర్వాహణ అధికారి తమకే పట్లనట్లుగా వ్యవహారిస్తుండటంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో ఆలయానికి వచ్చే ఆదాయానికి గండిపడుతోందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

**యస్డియఫ్ నిధులు..అందుబాటులోలేవు మరుగుదొడ్లు...**

భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రతి ఏటా ఉత్సవాలకు ప్రభుత్వ కోటి రూపాయలను కేటాయిస్తూ వస్తోంది. ఉత్సవాలకు కేటాయించిన కోటి రూపాయలతో ఉత్సవాల నిర్మాణ పూర్తయ్యాక మిగిలిన నిధులతో శాశ్వత పనులు చేపట్టి భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్న తలంపుతో 2019లో ఆలయ పక్కన గల సంతర్పణ బొడ్డే వద్ద మరుగుదొడ్లు నిర్మించాలని తలంచి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి మిగులునిధులైన 10లక్షలతో పురుషులకు, మహిళలకు మరుగుదొడ్లు నిర్మించారు.

అయిత వాటి నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో అటుగా వెళ్లే అవకాశాలు లేకపోవడంతో మరుగుదొడ్లు అలంకార ప్రాయంగా మరుగుదొడ్లు మిగిలిపోయాయి. భక్తులు పడుతున్న పాట్ల విషయాన్ని ప్రభాతవార్త ఆలయ ఇఒ చంద్రశేఖర్ దృష్టికిక తీసుకుపోగా అదనపు బాధ్యతల మూలంగా ఏడుపాయల ఆలయానికి మూడు రోజులే కేటాయిస్తున్నానన్నారు. పూర్తి స్థాయి ఈఓను కాదని, ఇంచార్జి ఇఓనని చంద్రశేఖర్ ఖారాఖండిగా వివరణ ఇవ్వడం కొసమెరుపు...

## మైలారం మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే



మైలారం మల్లన్నస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అనంత్‌సాగర్‌లో కొలువున్న శ్రీశ్రీశ్రీ మైలారం మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. జాతర ఉత్సవాలకు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, ఎపి రాష్ట్ర మాజీ స్పోర్ట్ అథారిటి ఛైర్మన్ బైరెడ్డి సిద్దార్ధరెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డిలు చేరుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాతర ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా చేరుకున్న ఎమ్మెల్యే, నాయకులకు ఉత్సవ కమిటి బాధ్యులు సాదరంగా స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివరాథోడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భోజిరెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు పండరిరెడ్డి, యువ నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల్లో భక్తుల సందడి

**పాపన్నపేట, డిసెంబరు 15, ప్రభాతవార్త:**

భక్తుల ఇలవేల్పుగా వెలుగొందుతున్న ఏడుపాయల వనదుర్గా భవాని మాత సన్నిధి ఆదివారం భక్తుల సందడి ఆలరారింది. ఆలయ అర్చకులు వేకువజామున అమ్మవారి మూల విరాట్ విగ్రహానికి అభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించి వేద మంత్రాలు వల్లిస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు తమ మొక్కుబడిలో బాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీరా పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి బోనాలు సమర్పించి ఒడి బియ్యం నింపి కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయ ఈఓ చంద్రశేఖర్, ఆలయసిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, బ్రహ్మచారి, నర్సింలు, వరుణాచారి, బత్తిని రాజు, నరేష్‌లు తగు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తన సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశారు.

## నేడు ప్రజావాణి రద్దు

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో ఈనెల 16న గ్రూప్-2 పరీక్షలు ఉన్నందున కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిలాన్ల కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి ఎవరూ రావొద్దని కలెక్టర్ సూచించారు.

# సమతుల ఆహారంతో మెదడులో చురుకుదనం

### రాష్ట్ర ఫారెస్ట్ అధికారి రామలింగం

**కొండపాక, డిసెంబరు 15, ప్రభాతవార్త:** విద్యార్థు లు సమతుల ఆహారం తీసుకుంటే మెదడు చురుకుగా పనిచేసి విద్యారంగంలో ఫలితాలు బాగా వస్తాయని రాష్ట్ర ఫారెస్ట్ శాఖాధికారి రామ లింగం అన్నారు. తెలంగాణరాష్ట్ర మహాత్మ జోతిబా పూలే గొల్లపల్లి పాఠశాల, కళాశాలల అధ్వర్యంలో మెదక్ ఇంజనీరింగ్ కళాశాలలో డైట్‌మెను పెంచిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాద్ అధ్యక్ష తన ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కొత్తగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూడైట్‌ను ప్రారంభించి మాట్లాడారు. పోషకా హారం తీసుకోవడం వల్ల విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని తెలిపారు. పాఠ శాలలు, కళాశాలల్లోనే సామాజిక, నైతికవిలువలు నేర్చుకోవడం, నేర్పించడం జరుగుతుందన్నారు. పాఠశాలస్థాయి నుండే భవిష్యత్‌ప్రణాళికను మన స్సులో పెట్టుకొని చదువుకోవాలని సూచించారు. గతంలో ఉన్న మెనూ కంటె దాదాపు 40శాతం వరకు ఎక్కువ పెంచడం జరిగిందన్నారు. మెనూ పెంచడం వల్ల పోషకాహారం ఎక్కువగా అంది విద్యార్థుల్లో పఠనాశక్తి మరింత పెరుగుతుంద న్నారు. పాఠశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ తల్లిదం డ్రులు విద్యార్థులకు ఫోన్‌లు ఇవ్వవద్దని సూచిం చారు. ఫోన్‌ల వల్ల లాభం కంటె నష్టమే ఎక్కువగా ఉందన్నారు. తల్లిదండ్రులు తమపిల్లల వద్దకు వచ్చినపుడు ఉపాధ్యాయులతో, ప్రిన్సిపల్‌తో కలిసి వారిపిల్లల గురించి అడిగి తెలుసుకోవాలని కోరా రు. పాఠశాలలో నాణ్యమైనవిద్యతో పాటు నాణ్య మైన పోషకాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దుద్దెడలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠ శాలలో ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, దుద్దెడ బాలుర హాస్టల్‌లో ఎపిఓ సర్వర్ పాషా, తెలంగాణ మోడ ల్ స్కూల్‌లో ఎపిఓ శివరామ కృష్ణ, మహాత్మ జ్యోతిబాపూలే జగదేవ్‌పూర్ పాఠశాలలో తహసీ ల్దార్ దిలీప్‌నాయక్ కొండపాక బాలికల హాస్టల్‌లో నూతన మెనూను ప్రారంభించారు.

ఈ కార్యక్రమాల్లో ఎంపిఓ మల్లికార్జున్, ఎపిఓ మగ్దుం అలీ, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదం డ్రులు, అయా పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రిన్సి




మహాత్మజ్యోతిభా పూలే పాఠశాలలో మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారి రామలింగం

## తల్లిదండ్రుల కలలను సాకారం చెయ్యాలి

**నర్సాపూర్ డిసెంబరు 15, ప్రభాతవార్త:** విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగి కన్న తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. నర్సాపూర్ పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో కామన్ డైట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో కామన్‌డైట్ కార్యక్రమంలో విద్యార్థులకు అంది స్తున్న ఆహారంపై కామన్ డైట్ మెనూను ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగాఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ గురుకులాల్లో చదివిన విద్యార్థుల భవిష్యత్ తరాలకు బాట చేసే విధంగా గొప్ప స్థాయికి ఎదగాలని అన్నారు. ప్రైవేటు స్కూళ్ల కన్నా రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థులను చేర్చే విధంగా చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు తక్కువనే అపోహ తొలగించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రెసిడెన్షియల్‌లకు కామన్ డైట్ రూపొందించి గ్రామీణ ప్రాంతాల్లో ఉండే విద్యార్థులు ఆర్థిక స్తోమత లేనందున చదువు మధ్యలో ఆపేసే విద్యార్థుల కోసం కేసీఆర్ హా యాంలోనే రెసిడెన్షియల్ లను పెంచారని అన్నారు. పిల్లలను జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా వారిని తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని అన్నారు. ఈ మేరకు రెసిడెన్షియల్ స్కూల్ లను దేవాలయాలుగా భావించి రాష్ట్ర స్థాయిలో కాకుండా దేశ స్థాయిలో ఆటలు ఆడే విధంగా కల్చరల్ ఆక్టివిటీస్ జరిగే విధంగా చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ మేరకు ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రులు కన్న కళలను సాకారం చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డి.ఎస్.పి శిల్పావళి. ఆర్డిఓ మైపాల్ రెడ్డి. మున్సిపల్ ఛైర్మన్ అశోక్ గౌడ్. వైస్ ఛైర్మన్ నహీముద్దీన్. నాయకులు చంద్ర గౌడ్. సత్యం గౌడ్. మండల పార్టీ అధ్యక్షుడు భోగ శేఖర్. నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు

## ఆలయ భూమి కోసం మంత్రికి వినతి



రాష్ట్రమంత్రి కొండాసురేఖకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

**నర్సాపూర్ డిసెంబరు 15, ప్రభాతవార్త:** నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంట శివారులో వెలిసిన జల హనుమాన్ టెంపుల్‌కు భూమి కేటాయించాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖను యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో వినతి చేయడం జరిగింది. ఈ మేరకు అటవీశాఖ మంత్రి కొండ సురేఖ స్పందించి ఈ జలహనుమాన్ టెంపుల్‌కు భూమి కేటాయించాలని మంత్రి కొండా సురేఖను కోరారు. ఈ మేరకు పెద్ద చింత కుంట గ్రామస్తులతో కలిసి విజయ్ కుమార్ యాదవ్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ బాలు, శ్రావణ్, నాగేష్, దుర్గేష్, శ్రీకాంత్, ప్రశాంత్, కృష్ణ, పవన్, శివ తదితరులు పాల్గొన్నారు

## మల్లన్న జాతరలో మాజీ ఎమ్మెల్యే



మల్లన్న జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అనంతసాగర్‌లో కొనసాగుతున్న మల్లన్నస్వామి జాతర ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర మాజీ కార్పోరేషన్ ఛైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, ఎమ్మెల్యే కుమార్తె మహారెడ్డి శ్రేయరెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు నరసింహారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ రాజు, మాజీ ఉప సర్పంచ్ సిద్దు, మండల బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు నర్సింలు యాదవ్, నాయకులు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న సన్నిధికి తరలివచ్చిన భక్తజనం

**కొమురవెల్లి, డిసెంబరు 15, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి సన్నిధికి భక్తులు ఆదివారం పెద్దయెత్తున తరలివచ్చారు. దీంతో స్వామి వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి పట్నాలు వేసి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే నిత్య కళ్యాణం, అభిషేకాలు, కేశఖండన, గంగరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. అనంతరం అక్క ఎల్లమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈఓ బాలాజీ, ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్ తదితరులు తగు ఏర్పాట్లు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది, అర్చక బృందం, ఒగ్గు పూజారులు, ధర్మకర్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**శివ్వంపేట, నవంబరు 15, ప్రభాతవార్త:**

కుటుంబ కలహాలతో వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చెన్నాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చెన్నాపూర్ గ్రామానికిచెందిన మద్దంగుల ఆంజనేయులు(32), అతని భార్య నాలుగుసంవత్సరాల నుండి కాపురానికి రావడంలేదని పిల్లలుకూడా రాకపోవడంతో మనోవేదనకు గురై మద్యానికి బానిసై ఈ నెల 14న రాత్రి పురుగుల మందు తాగగా అతని తమ్ముడు గమనించి ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ ఈనెల 15న ఉదయం 5:30 గంటల సమయంలో చనిపోయారు. ఈ విషయంపై అతని తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు.